ప్రజాశక్తి
శుక్రవారం 23 మే 2025

## సిఐ, ఎస్ఐలకు సత్కారం

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:నూతనంగా ఎన్నికైన ఏపీడబ్ల్యూజెఎఫ్ అరకులోయ మండల కమిటీ సభ్యులు గురువారం అరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్ హిమగిరి, ఎస్ఐ గోపాలరావును అరకు సర్కిల్ పోలీస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. నూతనంగా ఎన్నికైన మండల కార్యవర్గానికి వారు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ, మారుమూల ప్రాంతాల్లో మూఢనమ్మకాలు పెరిగిపోతున్నాయని, పోలీస్ శాఖ తరపున అవగాహన కల్పిస్తున్నామన్నారు. వార్త సేకరణకు మారుమూల ప్రాంతాలకు వెళ్తున్న సమయంలో మూడనమ్మకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యుజెఎఫ్ అధ్యక్ష, కార్యదర్శుల బిమిడి త్రినాద్, వంతల డేవిడ్, ప్రధాన కార్యదర్శి కె సింహాచలం, జిల్లా ప్రధాన కార్యదర్శి రహీం, రామన్న, బుజ్జి బాబు పాల్గొన్నారు.

సత్కరిస్తున్న ఎపిడబ్ల్యుజెఎఫ్ సభ్యులు

# హైరిస్క్ గ్రామాల్లో జ్వరాలపై సర్వే చేయాలి

### రాష్ట్ర మలేరియా విభాగం డిప్యూటీ డైరెక్టరు రామనాథరావు

ప్రజాశక్తి-అరకులోయ:ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గన్నెలలో రాష్ట్ర మలేరియా డిప్యూటీ డైరెక్టరు టి.రామనాథరావు సందర్శించి మొదటి విడత దోమల మందు పిచికారి పనులు పరిశీలించారు. మలేరియా కేసులు వివరాలు తెలుసుకొని హై రిస్క్ గ్రామాలలో ప్రత్యేక జ్వర సర్వే లు చేయవలసిందిగా ఆదేశించారు. హట్టగూడ గ్రామంలో మలేరియా కేసుకు అందించిన చికిత్స, ఐఆర్ఎస్ స్ప్రే, ఏ.యల్.ఒ, ఫాగింగ్‌కు తీసుకున్న చర్యలను పరిశీలించి, అన్ని మలేరియా కేసులకు కంట్రోల్ చర్యలు తక్షణమే చేయవలసిందిగా మలేరియా సబ్ యూనిట్ అధికారిని ఆదేశించారు. అరుకు ఏరియా ఆస్పత్రిలో డెంగ్యూ, మలేరియా పరీక్షల వివరాలను పరిశీలించి సకాలంలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాలని ల్యాబ్ టెక్నీషియన్ లకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గన్నెల వైద్యాధికారి నాయుడు, ఏ.యం.ఒ ఏ జె సత్యనారాయణ, జిల్లా మలేరియా కన్సల్టెంట్ శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారి అప్పలస్వామి పాల్గొన్నారు.

అనంతగిరి:గిరిజన ప్రాంతంలో వ్యాపిస్తున్న మలేరియాను అరికట్టడంలో వైద్య బృందం నిర్లక్ష్యం వహించవద్దని రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ ఎస్ యు పి డి సి పి. రామనాథరావు హెచ్చరించారు.అనంతగిరి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆయన పర్యటించారు. మలేరియా కేసుల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎపిడమిక్ సీజన్ దృష్టిలో పెట్టుకొని మారుమూల గిరిజన గ్రామాల్లో మలేరియా వ్యాప్తి పై వైద్య సిబ్బంది దృష్టి పెట్టవలసిన అవసరం ఉందన్నారు. మలాథియాన్ స్ప్రేయింగ్ ప్రతి ఇంటికి వేయించాలని, జ్వరపిడుతులకు రక్త పరీక్షలు చేయాలని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్య వహిస్తే ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్విపిడిసి అసిస్టెంట్ శ్రీనివాసరావు, జిల్లా అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ సత్యనారాయణ, స్థానిక వైద్య అధికారిణి జ్ఞానేశ్వరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అనంతగిరి పిహెచ్‌సిలో రికార్డులను పరిశీలిస్తున్న రామనాథరావు

కూంబింగ్‌కు వెళ్తున్న సెంట్రల్ పోలీసు బలగాలు

## ఎఒబిలో పోలీసుల అప్రమత్తం

- రంగంలోకి అత్యంత నైపుణ్యం కలిగిన సెంట్రల్ పోలీసు బలగాలు
- మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో జల్లెడ పడుతున్న వైనం
- బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి-సీలేరు

చతీస్‌ఘడ్ సరిహద్దుల్లో మావోయిస్టులకు పోలీసులకు బుధవారం జరిగిన ఎదురు కాల్పుల్లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు 28 మావోయిస్టులు మృతి చెందిన నేపథ్యంలో ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో పోలీసులు అప్రమత్తమయ్యారు. వరస ఎన్‌కౌంటర్లతో తీవ్రంగా దెబ్బతిన్న మావోయిస్టులు ప్రతీకార దాడులకు తెగబడతారని పోలీస్ ఇంటెలిజెన్సీ వర్గాలు హెచ్చరికలు జారీ చేశాయి. దీంతో పోలీస్ ఉన్నతాధికారులు కింద స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేశారు. మావోయిస్టుల నుంచి పోలీసులకు, ప్రభుత్వ ఆస్తులకు ఎటువంటి నష్టం కలగకుండా పగడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్ అనంతరం ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో అత్యంత నైపుణ్యం కలిగిన సెంట్రల్ పోలీసు బలగాలను రంగంలో దింపి మావోయిస్టు ప్రభావతి ప్రాంతాలను పోలీసులు ఆధీనంలో తీసుకున్నారు. ఏవోబి సరిహద్దు మావోయిస్టు కీలక ప్రాంతాలను జల్లేడు పడుతున్నారు. పోలీసు కాల్పుల అనంతరం తప్పించుకున్న మావోయిస్టుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. పోలీసులకు ఎటువంటి నష్టం కలగకుండా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. అత్యాధునిక ఆయుధాలతో చతీస్‌ఘడ్ సరిహద్దులతో పాటు ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో మావోయిస్టులు ఆచూకీ కోసం వేట కొనసాగిస్తున్నారు. దీంతో ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో పోలీసులు హైఅలర్ట్ అవ్వడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని గిరిజనులు తీవ్ర భయాందోళనకు గురవుతూ బిక్కుబిక్కుమటూ జీవిస్తున్నారు.

**నైట్ సర్వీసు బస్సులు రద్దు**

చతీస్‌ఘడ్ సరిహద్దుల్లో భారీ ఎన్‌కౌంటర్ జరిగిన నేపథ్యంలో మావోయిస్టులు ఏ క్షణంలోనైనా దాడులకు పూనుకోవచ్చని పోలీసుల హెచ్చరికల మేరకు విశాఖ వయా నర్సీపట్నం, సీలేరు మీదగా భద్రాచలం వెళ్లే ఆర్టీసీ నైట్ సర్వీసు బస్సులు గురువారం నుంచి రద్దు చేశారు. తదుపరి పోలీసులు ఆదేశాలు ఇచ్చేవరకు నైట్ సర్వీస్ బస్సులు తిప్పే పరిస్థితి లేదు. అలాగే గురువారం నర్సీపట్నం నుండి సీలేరు మధ్యాహ్నం 2.50గంటలకు వచ్చిన బస్సు నిర్ణీత సమయం ప్రకారం సీలేరు నుంచి సాయంత్రం 4గంటలకు బయలుదేరాల్సి ఉండగా బస్సు వచ్చిన వెంటనే వెళ్ళిపోవాలని పోలీసులు తెలపడంతో ఆ బస్సు ఆగమేఘాలమై వెళ్ళిపోయింది. నాలుగు గంటలకు బయలుదేరుతుందని భావించి వచ్చిన ప్రయాణికులు ప్రయాణాలను వాయిదా వేసుకొని వెనుదిరిగి వెళ్లిపోవాల్సి వచ్చింది.

## మెగా డిఎస్‌సిలో.. ఏజెన్సీ పోస్టులను వినహాయించాలి

### ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి -పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డిఎస్సీలో ఏజెన్సీ షెడ్యూల్ ఏరియాలో నోటిఫై చేసిన ఉపాధ్యాయ పోస్టులు మినహాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉత్తర్వులు జారీ చేయాలని ఆదివాసీ స్పెషల్ డిఎస్సీ ద్వారా ఆ పోస్టులన్నీ భర్తీ చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం పాడేరులో ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో దీనిపై తీర్మానం చేశారు. ఈ సందర్భంగా మీడియాతో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా ఏజెన్సీ షెడ్యూల్ ఏరియాలో గిరిజన సంక్షేమశాఖ, మండల పరిషత్, జిల్లా పరిషత్, గురుకులం, ఉన్నత పాఠశాలల్లో 4680 ఉపాధ్యాయ పోస్టులు నోటిపై చేశారని, ఆదివాసులకు కేవలం 700 పోస్టులు మాత్రమే కేటాయించారన్నారు. గిరిజన సంక్షేమశాఖలో పాడేరు ఐటీడీఏ పరిధిలో 400 ఉపాధ్యాయ పోస్టులు నోటిపై చేసి ఆదివాసులకు 24 పోస్టులు మాత్రమే కేటాయించారని, 96 శాతం ఉన్న ఆదివాసులకు 6 శాతం పోస్టులు కేటాయించి 6 శాతం ఉన్న గిరిజనేతరులకు 96 శాతం ఉపాధ్యాయ పోస్టులు కేటాయించడం అన్యాయమని తెలిపారు. ఆదివాసుల పోరాటంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసులకు 100 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి పాడేరు పర్యటనకు ముందే 100 శాతం రిజర్వేషన్ తోపాటు మెగా డిఎస్సీ లో ఆదివాసీ ప్రాంత ఉపాధ్యాయ పోస్టులు మినహిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటాలు ఉధృతంగా చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి కృష్ణారావు, బుజ్జిబాబు సహాయ కార్యదర్శులు కొర్రా బాలయ్య, సాగిన చిరంజీవి, జిల్లా కమిటీ సభ్యులు రమేష్, నాగేంద్ర పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బాలదేవ్

## శ్రమదానంతో రోడ్డు గుంతలు పూడ్చివేత

### -అమలు కాని డిప్యూటీ సిఎం హామీ

ప్రజాశక్తి -అనంతగిరి:ఏళ్ల క్రితం ఉపాధి హామీ పథకం కింద కాలిబాట వర్షాలతో గోతులు మయం కావడంతో గ్రామస్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి శ్రమధానంతో గోతులు పూడ్చివెత పనులు చేపట్టారు. మండలంలోని మారుమూల కివర్ల పంచాయతీ పరిధి గంగవరం గ్రామస్తుడు సత్యారావు మాట్లాడుతూ గంగవరం నుండి టెంగలబంద వరకు ఏర్పాటు చేసుకున్న మట్టి రోడ్డు వర్షాలకు పూర్తిగా మరమ్మతులకు గురైందని, ద్విచక్ర ఇతర వాహనాలతోపాటు కాలినడకన రాకపోకలు సాగించేందుకు ఇబ్బందికరంగా ఉండడంతో రెండు గ్రామాల గిరిజనులు ఏకమై శ్రమధానంతో గోతులు పూడ్చివేయడం జరిగిందని తెలిపారు. ఆరు నెలల క్రితం పంచాయతీకి ఆనుకుని ఉన్న పెద్దకోట పంచాయతీలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటించి డోలి మోత రహిత గ్రామాలుగా తీర్చిదిదెందుకు నిధులు కేటాయిస్తునట్లు సభా ముఖంగా ప్రకటించారని, ప్రకటనలకే పరిమితం అయ్యిందే తప్ప ఆచరణలో అమలు కాలేదన్నారు. శాశ్వత తారు రోడ్డు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను పలుమార్లు కలిసి లిఖిత పూర్వకంగా విన్నవించినా పట్టించుకున్న దాఖలు లేవని ఆయన అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ గ్రామాలకు రోడ్డు సౌకర్యాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

మరమ్మతు పనులు చేపడుతున్న గిరిజనులు

## 24న గురుకులాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం అడ్మిషన్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలోని 8 (బాలురు-4, బాలికలు-4) గురుకుల కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో 1030 సీట్లకు (బాలురు-540, బాలికలు-490) అడ్మిషన్ కౌన్సెలింగ్ ఈ నెల 24న శనివారం ఉదయం 9గంటల నుండి నిర్వహించనున్నట్లు ఇరు ఐటిడిఎల ప్రాజెక్టు అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలికలకు రంపచోడవరం గురుకుల బాలికల కళాశాల, బాలురకుకు రంపచోడవరం గురుకుల బాలుర కళాశాలలో ఈ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. పదవతరగతిలో వచ్చిన మార్కుల మెరిట్ ఆధారంగా విద్యార్థులకు సీట్లు కేటాయించబడతాయి. విద్యార్థులు తప్పనిసరిగా ఎస్ఎస్‌సి టిసి, స్టడీ సర్టిఫికెట్, ఎస్ఎస్‌సి ఆన్లైన్ మార్కుల షీటు, కుల ధ్రువీకరణ పత్రంతోపాటు తెల్లరేషన్ కార్డు, విద్యార్థి ఆధార్, తల్లిదండ్రుల ఆధార్ జిరాక్స్ కాపీలు, విద్యార్థి 5 పాస్ పోర్టు సైజ్ ఫోటోలు, తల్లిదండ్రులు బ్యాంక్ పాస్ పుస్తకం జెరాక్స్, ఒక్క ఫైల్‌పై అన్ని సర్టిఫికెట్స్‌కు సంబంధించి 3 సెట్ల జెరాక్స్ తీసుకుని హాజరుకావాలి. మరిన్ని వివరాలకు అడ్మిషన్ల కన్వీనర్ రంపచోడవరం గురుకుల ప్రిన్సిపాల్ వారిని సంప్రదించాలి.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-వై.రామవరం : వై.రామవరం రెవెన్యూ కార్యాలయంలో విఆర్ఒగా పని చేస్తున్న కాంతమ్మ భర్త చోడి సీతారామయ్య మండలంలోని పనసలపాలెం గ్రామ శివారులో కల్వర్టులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... చోడి సీతారామయ్య బుధవారం ఇంటి పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై అడ్డతీగల వెళ్లారు. రాత్రయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గురువారం తెల్లవారుజాము నుంచి గాలింపు చర్యలు చేపట్టారు. మండలంలోని పనసల పాలెం గ్రామ శివారులో కల్వర్టు వద్ద సీతారామయ్య మృతదేహాన్ని గుర్తించారు. వెంటనే పోలీసులకు తెలియపరచగా వారు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. ప్రమాదవశాత్తు పడి చనిపోయారా? లేదా ఏదైనా వాహనం ఢీకొని చనిపోయారా? అనేది తెలియాల్సి ఉందని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెల్లడించారు.

## రోడ్డు పక్కనున్న చెట్లు యథేచ్ఛగా నరికివేత

### - చోద్యం చూస్తున్న ఆర్అండ్ బి అధికారులు

ప్రజాశక్తి- అడ్డతీగల

అడ్డతీగల మండలం ఎల్లవరం పంచాయతీ నాయుడుపాకలు గ్రామ సమీపంలో ఆర్ అండ్ బి అధీనంలో ఉన్న పురాతనమైన చెట్లను కొత్త మంది యథేచ్ఛగా నరికివేస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు. నాయుడుపాకల గ్రామం నుండి బొంగరాలపాడు, తిమ్మాపురం సమీప గ్రామాల్లో ఉన్న విలువైన భారీ వృక్షాలను కొంత మంది దళారులు పట్టపగలే నరికివేస్తున్నారని, వాటిని మైదాన ప్రాంతాలకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఆర్ అండ్ బి అధికారులు మాత్రమే నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు తప్ప సంబంధిత బాధ్యులపై చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా డివిజన్, జిల్లా స్థాయి అధికారులు స్పందించి యథేచ్ఛగా చెట్లు నరికి తరలిస్తున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నాయి.

ఆర్ అండ్ బి స్థలాల్లో నరికివేసిన భారీ వృక్షాలు

నిర్మిస్తున్న అక్రమ నిర్మాణం

## దర్జాగా అక్రమ నిర్మాణాలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలోని అరుకు పంచాయతీ కేంద్రంలో దర్జాగా అక్రమ కట్టడాల నిర్మాణాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారికి అనుకుని గిరిజనేతరులు అక్రమంగా ప్రభుత్వ స్థలాల్లో శాశ్వత దుకాణాలు నిర్మిస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గిరిజనులకు రక్షణ కవచంగా ఉన్న 1/70 చట్టానికి ధిక్కరించి నిర్మించుకుంటున్నారు. గిరిజన చట్టాలకు విరుద్ధంగా ఆక్రమ కట్టడాలను నిర్మిసున్నా వాటిని నిలుపుదల చేయాల్సిన అధికారులు పట్టించుకోలేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ అండదండలతో గిరిజనేతరులు అక్రమ కట్టడాలను పరదాల చాటున నిర్మిస్తున్నారని, సంబంధిత పంచాయతీ, రెవెన్యూ శాఖ అధికారులు స్థానికంగా ఉన్నప్పటికీ వాటిని నిలుపుదల చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానికులు తెలిపారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి అక్రమ కట్టడాలను నిలుపుదల చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

ఈ విషయంపై స్థానిక ఆర్ఐ రామును స్థానిక విలేకరులు వివరణ కోరగా... అక్రమంగా గిరిజనేతరులు శాశ్వత దుకాణాలు నిర్మిస్తే విచారణ చేపట్టి అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

వినతిపత్రాన్ని ఇస్తున్న నాయకులు

## తాగునీటి సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి-చింతపల్లి: చిన్నబరడ గ్రామం తక్షణమే తాగునీటి సౌకర్యం కల్పించాలని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వంతల బుజ్జిబాబు ఆధ్వర్యంలో గ్రామస్థులు ఎంపీడీవో శ్రీనివాసరావును కలిసి లిఖితపూర్వక విజ్ఞప్తి చేశారు. చిన్నబరడ గ్రామంలో సుమారు 90 కుటుంబాలు జీవిస్తున్నప్పటికీ తాగునీరు లేకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. 2014లో నవనిర్మాణ సమితి ఆధ్వర్యంలో పెదబరడ, చిన్నబరడ గ్రామాలకు గ్రావిటీ కింద తాగునీటి పథకం అమలులోకి తెచ్చినప్పటికీ, ప్రస్తుతం ఆ నీరు కేవలం పెదబరడ గ్రామానికే సరిపోతుండటంతో చిన్నబరడకు సరఫరా నిలిచిపోయినట్టు గ్రామస్థులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల ప్రధాన కార్యదర్శి రాజుబాబు, గ్రామస్తులు ధర్మ, శివ, రామకృష్ణ, చిన్ని పాల్గొన్నారు.

# ఎకో అటవీ పరిరక్షణ జోన్ ఏర్పాటు

### జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-రంపచోడవరం

పోలవరం ప్రాజెక్ట్ పాపికొండల నేషనల్ పార్క్ పరిధిలో కేంద్ర ప్రభుత్వం, సుప్రీం కోర్ట్ నిబంధనల ప్రకారం ఎకో అటవీ పరిరక్షణ జోన్ ఏర్పాటు చేయడం జరుగుతుందని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. పాపికొండల నేషనల్ పార్క్ విధివిధానాలపై గురువారం స్థానిక ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఛాంబర్‌లో చీఫ్ కన్సలేటర్ ఫారెస్ట్ బిఎన్ఎన్ మూర్తి, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం, డివిజనల్ ఫారెస్ట్ అధికారులు రవీంద్ర ధామ, భవిత, జిల్లాస్థాయి అధికారులతో కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం, కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం పోలవరం ప్రాజెక్ట్ పాపికొండల నేషనల్ పార్కు ఏర్పాటు చేయడానికి సంబంధిత గ్రామాలలో గ్రామసభలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఏకో అటవీ పరిరక్షణ జోన్‌కి పది కిలోమీటర్ల దూరంలో బౌండరీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. రంపచోడవరం, దేవీపట్నం, మారేడుమిల్లి మండలాల్లోని 10 గ్రామాలు, చింతూరు డివిజన్లో 12 గ్రామాలు మొత్తం 22 గ్రామాలు నేషనల్ పార్క్‌లో కలుస్తున్నాయని పేర్కొన్నారు. నేషనల్ పార్కులో కలుస్తున్న గ్రామాలలో గ్రామ సభలు ఏర్పాటు చేయాలని, ఆయా గ్రామాలకు ముందుగా నోటీసులు జారీ చేయాలని సూచించారు. ముందుగా రెవిన్యూ ల్యాండ్,. ఫారెస్ట్ ల్యాండ్ గుర్తించాలన్నారు. టూరిజం ప్రాంతంలో వివిధ శాఖలు భాగస్వామ్యం కావాలన్నారు. ఈ నేషనల్ పార్క్ ప్రాంతాల్లోని గిరిజనుల స్థితిగతులు తెలుసుకోవాలని, ఎన్జీవోలను కూడా భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు. వెబ్‌లైనుకు సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. ఈ నేషనల్ పార్క్ ప్రాంతంలో ఎన్ని జోన్లు ఏర్పాటు చేస్తున్నదీ, ఎంతమంది రైతులు ఉన్నది, ఎంతమంది గిరిజన రైతులకు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు మంజూరు చేసిందీ కలెక్టర్ ఆరా తీశారు. పాపికొండల నేషనల్ పార్క్ ప్రాంతంలో ఎక్కడెక్కడ మైనింగ్ ఉన్నది అడిగి తెలుసుకున్నారు. ఈ నేషనల్ పార్క్ ప్రాంతంలో ఎన్ని కుటుంబాలకు అవార్డులు మంజూరు చేయవలసి ఉంటుందో ఆరా తీశారు. నేషనల్ పార్క్ ప్రాంత గ్రామాలలో త్వరితగతిన గ్రామ సభలు నిర్వహించాలని డిఎల్‌పిఓ పద్మను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో సబ్ డీఎఫ్ఓలు అనూష, రాఘవ, ఫారెస్ట్ రేంజ్ అధికారులు ఏడుకొండలు, ఫిరోజ్, డి.కొండలరావు, ఈఈ ఐ.శ్రీనివాసరావు, ఏడిఏలు సిహెచ్ కెవి చౌదరి, కే.సావిత్రి, డిఈ సాయి సతీష్, డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్, ఎన్జీవో నాయకులు గూట్లే అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

**పోలవరం బాధితులకు ఆర్ అండ్ ఆర్**

పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితులకు ఆర్ అండ్ ఆర్, ల్యాండ్ టు ల్యాండ్ గిరిజనులకు ఏర్పాటు చేయడం జరుగుతుందని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహశీల్దార్లు, డిటిలు,సర్వేయర్లు, వీఆర్వోలు, ఆర్ఓలతో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ సమావేశం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం, ఎల్ఎంసి స్పెషల్ కలెక్టర్ సరళ వందనంతో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు గిరిజన ముంపు బాధితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ ద్వారా ల్యాండ్ టు ల్యాండ్, ముంపు బాధితులకు ఆర్అండ్ఆర్ కాలనీలు ఏర్పాటుకు ముఖ్యంగా చింతూరు డివిజన్లో ప్రభుత్వ భూములు, ప్రైవేట్ భూములు గుర్తించాలని సూచించారు. ముంపు బాధిత గిరిజనులకు వ్యవసాయానికి అణువుగా ఉన్న భూములను ప్రైవేట్ భూములు ప్రభుత్వ భూములు సర్వే నెంబర్లతో సహా గుర్తించాలని ఆదేశించారు. నేషనల్ హైవే 516 ఇ రోడ్డుకు ఇరువైపులా బాధితులకు ప్యాకేజీ అమలుపై ఆయన ఆరా తీశారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అంబేద్కర్, వెంకటేశ్వర్లు, నరసయ్య, తహశీల్దార్లు సిహెచ్ శ్రీనివాసరావు, కె.సూర్యనారాయణ, ఏవి సత్యనారాయణ, డిటిలు తేజస్విని, బాషా పాల్గొన్నారు.

## పూడికతీతలు, మరమ్మతులకు ప్రతిపాదనలు

### అధికారులను ఆదేశించిన కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం మండలం సిరిగిందలపాడు ఆయకట్ట ద్వారా గిరిజన రైతులకు సాగునీరు అందించేందుకు పూడికతీతలు, మరమ్మతులకు సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా ఏఎస్ దినేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సుమారు 450 ఎకరాలకు పందిరి మామిడి, జాగారంపల్లి గ్రామాల గిరిజన రైతులకు సాగునీటి కోసం ఏర్పాటు చేసిన సిరిగిందలపాడు ఆయకట్టుకు మరమ్మతులు చేపట్టాలని గిరిజన రైతులు, రంపచోడవరం ఎంపీపీ తదితరులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనికి స్పందించిన జిల్లా కలెక్టర్ రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం, డీఎఫ్ఓ రవీంద్ర దామతో కలిసి సిరిగిందలపాడు ఆయకట్టను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంపచోడవరం ఈ ఆయకట్టు ద్వారా ఎన్ని గ్రామాల గిరిజన రైతులు వ్యవసాయం చేయుచున్నది, ఎన్ని ఎకరాలకు సాగునీరు అందిచున్నది తదితర వివరాలు ఆయన అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఎంపీపీ బంధం శ్రీదేవి, రంపచోడవరం సర్పంచ్ మంగ బుజ్జయ్య, తహశీల్దారు పి.రామకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ.శ్రీనివాసరావు, సుబ్బయ్య, ఎంపీడీవో యస్.శ్రీనివాసరావు దొర, ఉపాధి హామీ పథకం ఎపిడి బి సత్యనారాయణ, ఏఈ సాయి చందు, ఆర్ఐ నిర్మల, సిడిపిఓ సంధ్యారాణి, పంచాయతీ కార్యదర్శి రమేష్ తదితరులున్నారు.

సిరిగిందలపాడు వద్ద ఆయకట్టను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

## యోగా దినచర్యలో భాగం కావాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు:యోగాభ్యాసంతో అనేక లాభాలు న్నందున ప్రజల దిన చర్యలో యోగం భాగం కావాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ స్పష్టం చేశారు. రంపచోడవరం పర్యటనలో ఉన్న కలెక్టర్ గురువారం రంపచోడవరం ఐటిడిఎ నుండి జిల్లా అధికారులు, క్షేత్ర స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా నెల రోజులపాటు గ్రామ, మండల, జిల్లా స్థాయిలలో యోగాభ్యాసన చేయాలని, గిరిజన రోజైన జూన్ 21న యోగా వేడుకగా నిర్వహించాలని ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి యోగా కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఈ నెల 26 నుండి వచ్చే నెల 20వ తేదీ వరకు ప్రతి జిల్లాలో వివిధ శాఖల సిబ్బంది ఒక్కొక్క థీమ్‌తో కింద యోగా చేయాల్సి ఉందని తెలిపారు. జూన్ నాల్గవ తేదీన వంద వేల మంది గిరిజన ప్రజలతో యోగాభ్యాసన చేయనున్నారు. ప్రముఖ పర్యాటక కేంద్రాల వద్ద ఈ నెల 29న జూన్ 1, 11, 17 తేదీలలో నాలుగు రోజులు యోగ సాధన చేయనున్నారు. ముందుగా జిల్లాలో వంద మంది మాస్టర్ ట్రైనీలను గుర్తించాలని ఆదేశించారు. వారు ప్రతి మండలంలో రెండు వందల మందికి శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి సచివాలయం నుండి ఏడుగురు శిక్షకులను ఎంపిక చేసి ఒక్కొక్కరు కనీసం 50 మందికి చొప్పున 350 మందితో యోగ సాధన చేయాలన్నారు. జిల్లాలో ప్రతి ఒక్కరూ యోగాంధ్ర యాప్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా నుండి లక్ష మంది వరకు యోగ సాధనలో పాల్గొనే విధంగా ప్రజలకు అవగాహన కల్పించి ప్రోత్సహించాలని కలెక్టర్ కోరారు. ఈ సందర్భంగా పలు అంశాలలో పోటీలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జేసి ఎంజె అభిషేక్ గౌడ, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారులు కట్ట సింహాచలం, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### 1 నుండి రాకాసమ్మ దేవి జాతర

ప్రజాశక్తి-చింతపల్లి:ఆంధ్ర కాశ్మీర్‌గా పేరొందిన లమ్మసింగిలో రాకాసమ్మ దేవి జాతర మహోత్సవాలను జూన్ 1 నుండి 3 వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. గతంలో కన్నా ఈ ఏడాది వేడుకలు మరింత ఘనంగా సాగనుండడంతో భక్తులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. జాతర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్టు కమిటీ వెల్లడించారు.ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు గ్రామస్తులు, భక్తులు సహకారం అవసరమని తెలిపారు.

### 25న గీతం బిజినెస్ స్కూల్ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-మధురవాడ: గీతం వర్సిటీకి అనుబంధంగా ఉన్న గీతం బిజినెస్ స్కూల్ విశాఖ, హైదరాబాద్, బెంగళూరు ప్రాంగణాలలో నిర్వహిస్తున్న గ్రాడ్యుయేషన్, పోస్టుగ్రాడ్యుయేషన్ మేనేజ్‌మెంట్ కోర్సులలో ప్రవేశాలకు జాతీయస్థాయి ప్రవేశపరీక్ష (జిఎబి)ను ఈ నెల 25న నిర్వహిస్తున్నట్టు బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా పణి పప్పు తెలిపారు. గురువారం గీతంలో మీడియాతో మాట్లాడుతూ,ఈ గీతం బిజినెస్ స్కూల్ ద్వారా యుజి స్థాయిలో బికామ్, బిబిఎ (బిజినెస్ ఎనలిటిక్స్) బిబిఎ (ఫైనాన్షియల్ మార్కెట్స్), జనరల్ బిబిఎ కోర్సులను నిర్వహిస్తున్నామన్నారు. పిజి స్థాయిలో ఎంబిఎ కోర్సుతో పాటు వైద్య ఆరోగ్య రంగంలో నిపుణులను పెంపొందించేందుకు ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్, ఆకాడమి ఆఫ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్‌తో సంయుక్తంగా ఎంబిఎ హాస్పిటల్ అండ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ కోర్సును ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తరగతి గది బోధనతో పాటు వైద్య రంగంలో అవసరమైన ప్రాక్టికల్ శిక్షణ అనుభవాలను జోడిస్తూ ఈ కోర్సును రూపొందించామన్నారు.

# గిరి మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

**ఐటిడిఏ ఇంచార్జి పిఒ, జెసి అభిషేక్ గౌడ్**

మాట్లాడుతున్న ఇంచార్జి పిఒ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: గిరిజన మహిళలు వన్ ధన్ వికాస్ కేంద్రాలను సద్వినియోగం చేసుకుని వ్యాపార వేత్తలుగా ఎదగాలని ఐటిడిఎ ఇంచార్జి పిఒ, జెసి ఎంజె అభిషేక్ గౌడ్ సూచించారు. స్థానిక ఇండోర్ స్టేడియంలో 11 మండలాలలో 106 విడివికె సభ్యులకు గురువారం నిర్వహించిన ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలకు విడివికె ఉత్పత్తుల ప్యాకింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్, ఇ-కామర్స్ రంగాలలో శిక్షణ అందిస్తున్నామన్నారు. ఉత్పత్తి కేంద్రాలకు అవసరపు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఇ- కామర్స్ లో గిరిజన ఉత్పత్తులను విక్రయించాలని చెప్పారు. ఆర్గానిక్ ఉత్పత్తులకు మార్కెట్లో మంచి గిరాకి ఉందన్నారు. గిరిజన ఉత్పత్తులకు అదనపు విలువలను జోడిస్తే మంచి డిమాండ్ ఉంటుందని ప్రజల్లో నమ్మకం పెరుగుతుందన్నారు. ఆర్గానిక్ సర్టిఫికేషన్ తీసుకుని వస్తే మార్కెట్ విస్తరణ పెరుగుతుందన్నారు. గిరిజన ఉత్పత్తులకు దేశ వ్యాప్తంగా విస్తరించాలన్నారు. విడివికె ఉత్పత్తులు, వాటి సమస్యలపై ఎపిఎంలు నివేదికలు సమర్పిస్తే పరిష్కార చర్యలు చేపడతామని చెప్పారు. ఆకులతో తయారు చేసిన ప్లేట్లు, కప్పుల తయారీపై సభ్యులను అభినందించారు. ప్రభుత్వ కార్యక్రమాలు సభలు, సమావేశాలకు చిరుధాన్యాలతో తయారు చేసిన బిస్కెట్లను సరఫరా చేయాలని సూచించారు.

డిఆర్ డిఎ పిడి వి.మురళి మాట్లాడుతూ, కాఫీ, అడ్డాకులు, చింతపండు, చీపుర్లు తయారీ, చిరుధాన్యాలతో తయారు చేస్తున్న బిస్కెట్లను విడివికెల ద్వారా అదనపు విలువలను జోడించి విక్రయించడం జరుగుతోందన్నారు. 106 విడివికెల నుండి గిరిజన ఉత్పత్తులు చేయడం జరుగుతోందన్నారు. విడివికె సభ్యులు ఇంకా అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై నివేదికలు అందిస్తే సమకూరుస్తామన్నారు. ఐటిడిఎ ద్వారా విడివికెలకు ఉచితంగా యంత్ర పరికరాలను సరఫరా చేసి సభ్యులకు యంత్ర పరికరాల వినియోగం ఉత్పత్తులపై శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. విడివికెలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 11 మండలాల ఎంపిడిఒలు విఎన్ ప్రసాద్, చిన్నారావు, ఏరియా కో ఆర్డినేటర్లు, 106 విడివికెల సభ్యులు పాల్గొన్నారు.

**జిఒ 3, 1/70 చట్టంపై**

# సిఎం స్పష్టమైన ప్రకటన చేయాలి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

ప్రజాశక్తి-పాడేరు:అరకు ఎన్నికల సభలో సీఎం చంద్రబాబు నాయుడు జీఓ .3 పునరుద్దిస్తామని, స్పెషల్ డీయస్సీ నిర్వహిస్తామని ఇచ్చిన హామీతో పాటు ఐదో షెడ్యూల్ ప్రాంతంలో 1/70 చట్టం పటిష్టంగా అమలు చేస్తామని లిఖితపూర్వకంగా స్పష్టమైన ప్రకటన చేసిన తర్వాతే పాడేరులో పర్యటించాలని, లేని పక్షంలో వైఎస్సార్సీపీ తరపున ఆయన పర్యటనను అడ్డుకుంటామని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు హెచ్చరించారు. గురువారం సాయంత్రం తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 31న సీఎం చంద్రబాబు పాడేరులో పర్యటిస్తారని పత్రికల్లో వచ్చిన వార్తలపై ఆయన స్పందించారు . సీఎం ఏజెన్సీ పర్యటన నేపథ్యంలోనే ఏడాది కాలంగా ఏర్పాటు చేయని ట్రైబల్ అడ్వైజరి కౌన్సిల్ అదరాబాదరగా ఏర్పాటు చేశారన్నారు. టీఏసీ ఏర్పాటుకు వైఎస్సార్సీపీతో పాటు గిరిజన, ప్రజా, ఆదివాసీ, ఉద్యోగ, ఉపాద్యాయ సంఘాలు, స్పెషల్ డీయస్సీ సాధన చేసిన ఉద్యమ ఫలితం అన్నారు. అత్యవసరంగా టీఏసీ సమావేశాన్ని ఏర్పాటు చేసి జీవోం.3 పునరుద్ధరణ లేదా ప్రత్యామ్మయ జీఓతో పాటు 1/70 చట్టం పటిష్టంగా అమలు కోరుతూ అత్యవసరంగా తీర్మాణాలు చేయాలని డిమాండ్ చేశారు.గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం పేద ప్రజలకు మేలు చేయాలనే లక్ష్యంతో ఎండీయూ వ్యవస్థను నెలకోల్పి రేషన్ వాహనాల ద్వారా ఇంటింటికి రేషన్ సరుకులు అందించిందన్నారు. ఈ వ్యవస్థ ద్వారా నేటికి లబ్ధి పొందుతున్న లబ్ధిదారులు వైఎస్ జగన్ను గుర్తు పెట్టుకున్నారని, ఆయనకు మంచి పేరు వస్తుందనే కుటిల బుద్ధితోనే ఇంటింటికి రేషన్ వ్యవస్థకు ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. పేద ప్రజలను కష్టాలు పడుతుంటే సీఎం, డిప్యూటీ సీఎం కొత్త హెలికాప్టర్లను కొంటున్నారన్నారు. గిరిజన ప్రాంతంలో మళ్ళీ రేషన్ కష్టాలు మొదలవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంపై పునరాలోచించి తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. సమావేశంలో వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, కించూరు సర్పంచ్ వంతాల రాంబాబు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ పోటీలకు న్యాయనిర్ణేతగా డాక్టర్ శర్మ

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : నగరంలోని ఎల్ఐసి కార్యాలయంలో హైయర్ గ్రేడ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న డాక్టర్ డివిఎస్‌వై శర్మ అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ పోటీలకు న్యాయనిర్ణేత (టెక్నికల్ ఆఫీషియల్)గా ఎంపికయ్యారు. ఈనెల 27 నుండి వచ్చేనెల15 వరకు అహ్మదాబాద్‌లో జరిగే అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ (యుటిటి) పోటీలకు, అలాగే వచ్చేనెల 24 నుంచి జూలై రెండు వరకు ఉజ్బెకిస్తాన్ దేశంలోని తాస్కంట్ నగరంలో జరిగే ఏషియన్ యూత్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ పోటీలకు న్యాయ నిర్ణేత (టెక్నికల్ అఫీషియల్)గా వ్యవహరించనున్నారు. ఇటీవల కేరళలోని కొచ్చి లో జరిగిన ఆల్ ఇండియా పోలీస్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌కు శర్మను టెక్నికల్ డెలిగేటుగా ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్ నియమించింది. ప్రస్తుతం ఆయన ఎల్ఐసిలో స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు మెంబర్‌గాను, ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ సంఘం ఉపాధ్యక్షుడిగాను, విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం కార్యదర్శిగా తన సేవలను అందిస్తున్నారు. స్పోర్ట్స్ మేనేజ్మెంట్‌లో పిహెచ్‌డి చేసి డాక్టరేట్ అందుకున్న డాక్టర్ శర్మ, డెహ్రాడూన్‌లో జరిగిన నేషనల్ గేమ్స్‌కు, పలు అంతర్జాతీయ పోటీలకు అంపైర్‌గా వ్యవహరించారు. ఇంటర్నేషనల్ టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ నుంచి బ్లూబ్యాడ్జి ఇ అంపైర్‌గా అర్హత సాధించిన 11 మందిలో డాక్టర్ శర్మ ఒకరు.

## సాంకేతిక కళాశాలలు ఏర్పాటు చేయాలి

**రాష్ట్ర మంత్రి లోకేష్‌కు దొన్ను దొర వినతి**

మంత్రి లోకేష్ ను కలిసిన దొన్నుదొర

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:అరకు నియోజకవర్గ పరిధిలో ఇంజనీరింగ్, బిఎడ్, డిఎడ్ కళాశాలను మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ను గురువారం ఏపీఎస్ఆర్టిసి విజయనగరం రీజినల్ బోర్డు చైర్మన్ సియ్యారి దొన్ను దొర మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.అరకు నియోజకవర్గ పరిధిలో పర్యాటక కేంద్రాలు మాడగడ సన్రైజ్ వ్యూ పాయింట్,ఉప్ప చెట్లు, తారాబు వాటర్ ఫాల్ ప్రాంతాలను పర్యాటకంగా పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్లో అన్ని నియోజకవర్గాల కంటే అరకు నియోజకవర్గం అత్యంత వెనుకబడిన ప్రాంతమని, విద్య, ఆర్థిక ఇతర విషయాలను కూడా వెనుకబడిన ప్రాంతంగానే ఉందన్నారు.ముఖ్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్యా ద్వారానే జీవితంలో మార్పులు తీసుకొస్తుందని చెబుతుంటారని చెప్పేవారన్నారు.గిరిజనుల్లో క్రీడలలో ప్రతిభ కనబరిచే వ్యక్తులు అనేక మంది ఉన్న వారికి మెరుగైన శిక్షణ ఇచ్చేందుకు ఇక్కడ సౌకర్యాలు లేకపోవడంతో వారంతా మెరుగైన అవకాశాలు పొందేందుకు అవకాశం లేకుండా పోతుందని ,అందువలన అరకులో క్రీడా పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు.గిరిజన ప్రాంతంలో అనేకమంది ఉపాధ్యాయ వత్తిలో రాణించాలని తపనపడుతున్న వారు ఉన్నారని,మైదాన ప్రాంతాలకు వెళ్ళి చదువుకోలేని పరిస్థితి, సాధారణంగా ఆదివాసి బిడ్డలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవు తూన్నారన్నారు. యువత స్కిల్ డెవలప్మెంట్‌కు సంబంధించిన కోర్సులు అభ్యసించాలంటే వైజాగ్ వెళ్ళాల్సిందేరన్నారు.

## సబ్సిడీ వరి విత్తనాలు పంపిణీకి సిద్ధం

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:గిరి రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ వరి విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో రాయితీపై అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయశాఖ అధికారిణి నీలవేణి తెలిపారు. గురువారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై విత్తనాలను గిరిజన రైతులకు పంపిణీ చేసేందుకు ముందస్తుగా రైతు సేవా కేంద్రాల్లో సరఫరా చేసిందన్నారు. 750క్వింటాళ్ల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ప్రస్తుతం 1121ఎంటీరకంతో పాటు 1818రకం విత్తనాలు అంటుబాటులోకి వచ్చాయన్నారు. 1014రకంతో పాటు ఆర్ఎన్ఆర్ 15048రకం విత్తనాలు రావాల్సి ఉందన్నారు. రాయితీపై పంపిణీ చేసే వరి విత్తనాలను రైతు సేవా కేంద్రాల్లో తీసుకోవాలని ఆమె కోరారు.

## ఔషధ పరిశ్రమల్లో మహిళలకు పెద్దపీట

ప్రజాశక్తి-మధురవాడ : ఔషధ పరిశ్రమల్లో మహిళల ప్రాతినిధ్యం పెంచడమే లక్ష్యంగా ఫైజర్, గీతం వర్సిటీతో భాగస్వామ్యం చేసుకుంది. ఈ మేరకు ఫైజర్ ఉద్యోగులుగా ఉండి, గీతం వర్సిటీలో మైక్రోబయాలజీ స్పెషలైజేషన్‌తో బిఎస్‌సి కెమెస్ట్రీ 36నెలల డిగ్రీ కోర్సు పూర్తి చేసుకున్న 44మంది మహిళలతో కూడిన 'ఫైజర్ అటానమస్ టీమ్' (పిఎటి) మొదటి బ్యాచ్ గురువారం రిలీవయ్యారు. ఇకనుంచి వారంతా ఫైజర్ ఔషధ పరిశ్రమలో రెగ్యులర్ ఉద్యోగులుగా కొనసాగనున్నారు. ప్రస్తుతం, విశాఖపట్నం ఫైజర్ తయారీ యూనిట్‌లో 340 మందికి పైగా మహిళా విద్యార్థులు పిఎటి ప్రోగ్రామ్‌లో భాగమయ్యారు. ఈసందర్భంగా ఫైజర్ వైస్ ప్రెసిడెంట్ (సైట్ హెడ్) బి.మురళీధర్‌శర్మ మాట్లాడుతూ, పిఎటి ప్రోగ్రాం ద్వారా 44మంది మహిళా విద్యార్థులు గ్రాడ్యుయేషన్ పూర్తిచేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. తమ విద్యార్థులకు అత్యంత అభ్యాస అనుభవాలను అందించిన గీతం వర్సిటీకి కృతజ్ఞతలు తెలిపారు. గీతం వైస్‌ఛాన్సలర్ డాక్టర్ ఎర్రోల్ డిసౌజా మాట్లాడుతూ, గీతం, ఫైజర్ సంయుక్తంగా రూపొందించిన పాఠ్యాంశాలలో పరిశ్రమకు కావాల్సిన తాజా సాంకేతిక నైపుణ్యాలతో యువతులను సిద్ధం చేసి అందించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆసియా-పసిఫిక్, ఆఫ్రికా,మిడిల్ ఈస్ట్ రీజియన్‌లోని పీపుల్ ఎక్స్‌పీరియన్స్, ఫైజర్ గ్లోబల్ సప్లై సీనియర్ డైరెక్టర్ రేష్మా పరిదా, జిఎస్ఎస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. వేదవతి, పిజిఎస్ ఇండియా పీపుల్ ఎక్స్‌పీరియన్స్ డైరెక్టర్ టి.రవికిరణ్ పాల్గొన్నారు.

శివశంకర్‌రావును కలిసిన ఆదివాసీ నేతలు

### షెడ్యూల్డ్ ఏరియాలో.. గిరిజనులకు శత శాతం రిజర్వేషన్ కల్పించాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : షెడ్యూల్డ్ ఏరియాలో ఆదివాసీలకు శత శాతం రిజర్వేషన్ కల్పించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కేలా చూడాలని ఎపి ఎంఎస్ఎంఇ చైర్మన్, జనసేన రాష్ట్ర నాయకులు టి.శివశంకర్‌రావును అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం, ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీల నాయకులు కోరారు. ఎంవిపి.కాలనీలోని ఆయన నివాసంలో నేతలు కలిసి ఆదివాసీల సమస్యలను విన్నవించారు. ఆదివాసీ ప్రాంతంలో ఎంఎస్ఎంఇ ద్వారా ఆదివాసీ పారిశ్రామికవేత్తలను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. ఏజెన్సీలో ఉద్యోగాలను గిరిజనులకే కేటాయించాలన్నారు. మెగా డిఎస్‌సిలో ఏజెన్సీ పరిధి టీచర్ పోస్టులను మినహాయించి, ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ ప్రకటించి భర్తీ చేయాలన్నారు. సమస్యలను ఉపముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాచిపెంట అప్పలనర్స, కోటి, వరప్రసాద్, కుడుముల కాంతారావు, వంపూరి గంగులయ్య, కటారి శోభన్ కుమార్, సీసా శోభన్, కోరాబు సత్యనారాయణ, వంతల ఆనందరావు పాల్గొన్నారు.

### ఎస్‌సి వర్గీకరణ రోస్టర్‌లో మాదిగలకు అన్యాయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, సీతమ్మధార : ఎస్‌సి వర్గీకరణ రోస్టర్‌లో ఎపిలో మాదిగలకు అన్యాయం జరిగిందని ఎపిఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం నగరంలోని బుదిల్ పార్క్ హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మోసం చేశారని అన్నారు. తెలంగాణలో 11 శాతం రిజర్వేషన్లను మాదిగలకు ఇవ్వాలని రేవంత్ రెడ్డిని అడిగిన మందకృష్ణ ఆంధ్రాలో 6 శాతం రిజర్వేషన్లను మాదిగలకు ఇస్తామన్న చంద్రబాబును ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. మందకృష్ణ మాదిగ స్వార్ధ ప్రయోజనాల కోసం 30 ఏళ్ల వర్గీకరణ ఉద్యమాన్ని చంద్రబాబుకు అమ్ముకున్నారని విమర్శించారు. ఎస్‌సి వర్గీకరణలో సమన్యాయం కోసం జూన్ 5న అమరావతిలో ఆంధ్ర రాష్ట్ర మాదిగ సంఘాల రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించి, భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు. సమావేశంలో పెద్దాడ రమణ పాల్గొన్నారు.

### పదవి కోసం ఏనాడూ పాకులాడలేదు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పదవి కోసం తాను ఏనాడూ పాకులాడలేదని తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ అన్నారు. జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ టి.శివ శంకర్‌ను రామ్ గురువారం ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ నెల 12న గాజువాకలో తనపై జరిగిన దాడి గురించి వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీనిపై దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలన్నారు. పదవి కోసం తాను ఏనాడూ పాకులాడలేదని, చంద్రబాబు నాయుడు సిఎం కావాలని మాత్రమే పాటుపడ్డానని అన్నారు. తెలుగుదేశం ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అనుచరులు వారి స్వలాభం కోసం ఎంతటి నీచానికైనా ఒడికడతారని చెప్పడానికి ఎన్నో ఉదాహరణలు వున్నాయన్నారు. దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు.

### మహిళకు కరోనా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ నగరంలోని పిఠాపురం కాలనీకి చెందిన 28 ఏళ్ల మహిళకు కరోనా లక్షణాలు ఉండటంతో గురువారం పరీక్షలు చేసిన వైద్యాధికారులు కోవిడ్‌గా నిర్ధారించారు. ఆమెకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం బాగానే ఉందని తెలిపారు. ప్రజలు పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

**గిరిజన రైతుల ఆర్థికాభివృద్ధికి**

# రైతు ఉత్పత్తి సంఘాలు ఏర్పాటు

**జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్**

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని గిరిజన రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా రైతు ఉత్పత్తి సంఘాలను ఏర్పాటు చేయడం జరిగిందని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏడు మండలాలకు సంబంధించిన రైతు ఉత్పత్తి సంఘాల ప్రతినిధులు, వ్యవసాయ, పశుసంవర్థక శాఖ అధికారులతో గురువారం రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలంతో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు అభివృద్ధి చెందే విధంగా ఎన్జీవోల సహకారం కూడా తీసుకోవడం జరుగుతుందన్నారు. రైతు ఉత్పత్తి సంఘాలకు ప్రభుత్వం ద్వారా ఏమేమి కావాలో లిఖితపూర్వకంగా తెలియజేయాలని ఆదేశించారు. బ్యాంకు లింకేజీల ద్వారా రుణాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. గతంలో రుణాలు తీసుకున్న సంఘాలు ఏయే వ్యాపారాలు చేస్తున్నదీ, ఎంత లాభం వచ్చింది మండలాల వారిగా ఆయన ఆరా తీశారు. ఒక్కొక్క మండలంలో ఎన్ని రైతు ఉత్పత్తి సంఘాలు ఏర్పాటు చేసింది, ఒక్కొక్క సంఘంలో ఎంతమంది సభ్యులు ఉన్నది ఆయన అడిగి తెలుసుకున్నారు.

రైతు ఉత్పత్తి సంఘాల ద్వారా ఎన్ని మెట్రిక్ టన్నుల జీడిపిక్కలు ఈ ఏడాది రైతుల నుండి కొనుగోలు చేసింది ఆరా తీశారు. గిరిజనులు చిన్నచిన్న యూనిట్లు ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా అభివద్ధి చెందాలని సూచించారు. రైతు ఉత్పత్తి సంఘాలకు సబ్సిడీపై కరెంటు వివిధ రకాలైన వ్యవసాయ పరికరాలు అందించడం జరుగుతుందని చెప్పారు. రంపచోడవరం, గంగవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి మండలాల పరిధిలో ఇండస్ట్రియల్ పార్కు సుమారు యాభై ఎకరాలలో ఏర్పాటు చేయుటకు ప్రతిపాదన సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతు ఉత్పత్తి సంఘాల అభివృద్ధికి నోడల్ అధికారిని నియమించినట్లు చెప్పారు. రైతులు, రైతు ఉత్పత్తి సంఘాలు దళారుల దగ్గర మోసపోకుండా ఎక్కడికక్కడ అవగాహన కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఒక్కొక్క మండలంలో ఇన్ని విడివికెలు ఉన్నవి, ఎంతమంది సభ్యులు ఉన్నది ఆయన ఆరా తీశారు. అన్ని రైతు ఉత్పత్తి సంఘాలకు ఒక వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రైతులకు కావలసిన పరికరాలు గురించి ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారు చేసి సమర్పించాలన్నారు. గిరిజన రైతులకు, రైతు ఉత్పత్తి సంఘాలకు ఎరువులు, గొడౌన్స్ ఏర్పాటు చేయాలని రైతులు జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, వెలుగు ఏపీడి దేగలయ్య, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు సిహెచ్ కవి చౌదరి, కె. సావిత్రి, మండల వ్యవసాయ శాఖ అధికారి కె.లక్ష్మణ్, వెలుగు డిపిఎం పరమేశ్వర రావు, ఈఈ రవికుమార్, ఎన్జీవోలు, రైతు ఉత్పత్తి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# యోగా డే ప్రధాన వేదిక వద్ద పక్కా ఏర్పాట్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ వేదికగా జూన్ 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆర్‌కె బీచ్ కాళీమాత టెంపుల్ ముందు భాగంలో నిర్ణయించిన ప్రధాన వేదిక వద్ద పక్కా ఏర్పాట్లు చేయాలని వివిధ బృందాలుగా నియమించిన అధికారులను జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. కాళీమాత టెంపుల్ వద్ద దేశ ప్రధాని, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖులు యోగాసనాలు వేస్తారని, దాన్నే ప్రధాన వేదికగా పరిగణించాలని, అక్కడ 15 వేల మంది భాగస్వామ్యం అవుతారని తెలిపారు. ప్రధాన వేదికకు కొనసాగింపుగా పార్కు హోటల్ వరకు 50 వేల మంది పాల్గొంటారని, ఒక్కో కంపార్ట్మెంట్‌కు వెయ్యి మంది చొప్పున కూర్చునే విధంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టరేట్ మీటింగు హాలులో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో అధికారులను ఆయన ఆదేశించారు. 200 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పు కలిగే విధంగా కంపార్ట్మెంట్లను తయారు చేయాలని, దానికి తగిన మ్యాపులు సిద్ధం చేసి నివేదించాలని సూచించారు. ప్రధాన వేదిక నుంచి పార్కు హోటల్ వరకు వచ్చే అతిథులకు అనుగుణంగా ఎవరు ఎక్కడకు చేరుకోవాలో తెలియజేస్తూ నివేదికలు రూపొందించాలని, ఎక్కడికక్కడ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో 2.50 లక్షల మంది భాగస్వామ్యం అయ్యేలా చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు.

# కెజిహెచ్ పీజీ హాస్టల్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లో పీజీ చదువుతున్న రేడియాలజీ ఫస్ట్ ఇయర్ విద్యార్థి మోతిలాల్ ఆత్మహత్య చేసుకున్నారు. పీజీ బాయ్స్ హాస్టల్‌లో గురువారం ఈ సంఘటన జరిగింది. మృతుడు శ్రీకాకుళం జిల్లాకు చెందిన వాడని హాస్టల్ సిబ్బంది తెలిపారు. సమాచారం అందడంతో వన్ టౌన్ పోలీసులు అక్కడికి చేరుకొని విచారణ చేస్తున్నారు.

కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

### కొనసాగుతున్న ఉక్కు సమ్మె

ప్రజాశక్తి - ఉక్కునగరం : అక్రమ తొలగింపులను నిరసిస్తూ స్టీల్‌ప్లాంట్ కార్మికులు తలపెట్టిన సమ్మె గురువారానికి మూడో రోజుకు చేరుకుంది. విధులను బహిష్కరించి కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. వారంతా కూర్మన్నపాలెం కూడలిలోని ఉక్కు దీక్షా శిబిరం వద్దకు చేరుకున్నారు. అక్కడ జరిగిన సభలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ రానున్న కాలంలో స్టీల్‌ప్లాంట్ ఉద్యమం మరింత ఉధృతం కానుందన్నారు. ప్రస్తుత కాంట్రాక్టు కార్మికుల ఉద్యమం గెలిస్తే పని కోల్పోయిన వారంతా లోపలికి వస్తారని చెప్పారు. తుపాకులు ఎదుర్కోవటానికి కూడా కార్మికులు ప్రస్తుత తరుణంలో భయపడటం లేదన్నారు. కార్మికులంతా క్షణకాలం ప్లాంట్‌లో పనిచేయకుంటే ఉత్పత్తి స్తంభించిపోతుందని తెలిపారు. ప్లాంట్ నిర్మాణ సమయంలో అనుభవించిన శిక్షలను, కార్మిక పోరాటాలను గుర్తుచేశారు. ప్రస్తుత తరుణంలో ఐక్యతే ఆయుధంగా కార్మికులు ముందుకు సాగాలన్నారు. పోరాట కమిటీ ఛైర్మన్లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ ఐక్యంగా పోరాడి సాధించుకున్న హక్కుల రక్షణ కోసం ప్రతి కార్మికుడూ పోరాటాల్లో పాలుపంచుకోవాలన్నారు. పోరాట కమిటీ కో-కన్వీనర్ జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల సమ్మెకు పర్మినెంట్ కార్మికుల మద్దతు ఉందని తెలిపారు. గతంలో కాంట్రాక్ట్ కార్మికులు 17 రోజులపాటు సమ్మె చేసి మూడు వేల రూపాయల జీతాన్ని పెంచుకున్న విషయాన్ని గుర్తుచేశారు. 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారంలో ఉన్న కాంట్రాక్టు కార్మికులతో పాటు మిగిలిన వారంతా సోషల్ మీడియాను ఉపయోగించి ఉక్కు ఉద్యమాన్ని ప్రపంచానికి తెలియజేయాలన్నారు. యాజమాన్యం చెబుతున్న కల్లబొల్లి కబుర్లను నమ్మవద్దని తెలిపారు. పర్మినెంట్ కార్మికులను కూడా ప్లాంట్ యాజమాన్యం ఎలా తొలగిస్తోందో తెలియజేశారు. కార్మికుల పొట్టలు కొట్టి బీచ్‌లో యోగా చేస్తామంటే ఎలా ఊరుకుంటామని హెచ్చరించారు. సిఐటియు సీనియర్ నాయకులు ఎన్.రామారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉక్కు కార్మికులను మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చైర్మన్ ఎం.జగ్గునాయుడు, స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ, పెద్ద సంఖ్యలో ఉక్కు కాంట్రాక్టు, పర్మినెంట్ కార్మికులు పాల్గొన్నారు.

### డిప్యూటీ మేయర్ ఛాంబర్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసికి ఇటీవల డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన దల్లి గోవిందరాజుకు జివిఎంసి ప్రధాన కార్యాలయంలో అధికారులు కేటాయించిన ఛాంబర్‌ను విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, విశాఖ దక్షిణ నియోజకవర్గం శాసన సభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస యాదవ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గోవిందరాజుకు వారిరువురు పుష్ప గుచ్ఛాన్ని అందించి అభినందనలు తెలిపారు. విశాఖ నగర అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో జనసేన ఫ్లోర్ లీడర్ భీశెట్టి వసంతలక్ష్మి, కార్పొరేటర్లు ముమ్మన దేముడు, బెహరా భాస్కరరావు, కొయ్యా ప్రసాదరెడ్డి, మాజీ కార్పొరేటరు ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

### పిసిఒఎస్ సమస్య పోషకాహారంతో పరిష్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ (పిసిఒఎస్) ప్రపంచ వ్యాప్తంగా మహిళలను అధికంగా ప్రభావితం చేస్తోందని, ఆరోగ్యకరమైన అల్పాహార ఎంపికల ద్వారా ఈ సమస్యను పరిష్కరించవచ్చునని మ్యాక్స్ హెల్త్‌కేర్ రీజనల్ హెడ్, పౌష్టికాహార నిపుణురాలు రితికా సమద్దర్ అన్నారు. గురువారం ఉదయం బీచ్ రోడ్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పిసిఒఎస్‌తో హార్మోన్ల అసమతుల్యత ఏర్పడటం వల్ల మొత్తం ఆరోగ్యం, జీవక్రియ, బరువు ప్రభావితమవుతాయని తెలిపారు.